# ది గ్రేట్ 'బి-బి' !

ఆయన పేరి 'బి.బి' ! అందరూ అలాగే పిలుస్తారాయన్ను! మొదటి 'బి' ఆయన ఇంటిపేరు. 'బ' అంటే ఏమిటో ఎవరికీ తెలియదు. రెండవ 'బి' ఫుల్‌ఫామ్ బసవయ్య , అదాయన పేరు!

బసవయ్య అఖండుడు! దేవాంతకుడు! కొంపలు ముంచే తెలివితేటలున్న వ్యక్తి!. బసవయ్య నోటికి అంతా భయపడతారు. ఆయనకు కోపం వస్తే 'బసవన్న' లా రంకెవేస్తాడు. ముక్కుపుటాలెగరేస్తాడు. కళ్లెర్ర చేస్తాడు. పిడిగుద్దులు గుద్దినట్టు... పిడుగులు పడ్డట్టన్పిస్తుంది! ఎదిఉటివారి నోరు పడిపోక తప్పదు. నవనాడులూ కృంగినట్టన్పిస్తుంది!

పబ్లిక్ మీటింగుల్లో వుపన్యసించటానికి 'మైకు'లతో పన్లేదు. ఆయన స్వరం కిలోమీటర్ దూరం అవలీలగ విన్పిస్తుంది. బసవయ్యది కంచుకంఠం! ఖంగున మోగుతుంది.

బసవయ్య గురించి తెల్సినవారెవరూ ఆయన జోలికి పోరు. జంకుతారు. భయపడతారు. ఎంతటి వారినైనా 'ఓరేయ్' అనే సంబోధిస్తాడు. పెద్దచిన్న తారతమ్యం వుండదాయన దృష్టిలో!.

తాత ముత్తాతల కాలం నుండి వాళ్ల కుటుంబంలో ఏ వక్కరికీ పొట్ట పొడిచినా అక్షరం ముక్కరాదు!క్ష్మ అందరూ నిశానీదారులే! చదవ వ్రాయనురాదు.

ముత్తాత నుండి తండ్రి వరకు జనానికి 'మస్కా' కొట్టి డబ్బు సంపాదించారు. పొలాలు కొన్నారు. ఇళ్లు కట్టించుకున్నారు. ఇనప్పెట్టెల్లో బంగారు నగలు మూలుగుతూంటయ్.

బసవయ్యనైనా బడికి పంపాలని తండ్రి ఆరాజపడ్డాడు. బడి అంటే... వీధిబడో... ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలో కాదు... కాన్వెంట్లో చేర్పించాలని కలలు కన్నారు.

కలక్టర్‌నో... డాక్టర్‌నో చెయ్యాలని ఆశపడ్డారు!

బసవయ్య చిన్ననాటి నుండి మొండిఘటం! ఎవరేం చెప్పినా వినడు. ప్రతిదానికి 'డూ...డూ...' బసవన్నటాగ తలాడించేరకం కాదు. ప్రతి విషయంలోను మొండిగ

వాదిస్తాడు.

బసవయ్య ధాటికి (సారీ... నోటికి) వెరసి స్నేహితులెవరూ అతగాడితో ఆడుకునేవారు కాదు. మాట్టాడటానికే బయపడేవాళ్లు. తోటివారినేకాదు కాన్వెంట్లో 'మిస్స్' లను సైతం నోటికొచ్చినట్టు బండబూతులు తిట్టేవాడు.

బసవయ్య ధోరణికి మొదట్లో నివ్వెరపోయినా... ముక్కుమీదవేలేసుకున్నా... అవాక్కయినా... ఇతగాడిని స్కూల్లో భరించటం కష్టమన్పించటంతో కాన్వెంట్‌లోంచి గెంటేశారు.

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు బసవయ్యను పంపటం నామోషి అన్పించటంతో... వాడి ముఖాన చదువొచ్చే రాత ఆ దేవుడు రాయలేదన్పించటంతో చదువు మాన్పించి పాలంపన్లకు పంపటం తప్పనిసరైంది..!

కలిగిన ఆసామి కొడుకు కావటాన ఎవరిమీద తిరగబడినా... తిట్టినా... కొట్టినా... బసవయ్యనేమీ అన్లేకపోయేవారందరూ!

నోరు విప్పితే బూతుల పంచాంగమేనాయె! ఇంతటి ప్రబుద్ధుడిని దగ్గరకెవరు రానిస్తారు?. తనకు దూరంగవున్నా... కలిసి మాట్లాడకపోయినా... బసవయ్య చేతిలో తిట్లో తన్నులో తప్పవ్!.

ఎవరిని తిడితే ఎవరూరుకుంటారు?. అయినా సరే బసవయ్య నోటికి దడిసి నోరు మూసుకుంటారు! అందరిమీద పెత్తనం చెలాయించటమంటే బసవయ్యకు ఎంతో ఇష్టం!

శంకరయ్యకు ఏకైక సంతానం కావటాన బసవయ్య మీద మాటపడనీయడు. కొడుకు ఆడింది ఆట... పాడింది పాట! వయస్సొచ్చేకొద్దీ బసవయ్య రాజకీయాలు వంటపట్టించుకోవటం గమనించిన శంకరయ్యకు తన కొడుకు ఏనాటికైనా... ఎం.ఎల్.ఏ అయి తప్పక మంత్రికాగలడన్పించింది!.

అందుకే... ముందుగా బసవయ్యకు గ్రామ సర్పంచ్ పదవి కట్టబెట్టాడు. ఇంకేముంది రాత్రింబవళ్లు రాజకీయాల్లో క్షణం తీరికలేకుండా పనిచేస్తూ అందరి చేత సెభాష్ అన్పించుకుంటున్నాడు!.

తనమాట వినకపోయినా... చెప్పినపని చేయకపోయినా ముందు వెనుక ఆలోచించకుండా బూతులు తిట్టేవాడు. వాళ్ల పరువు తీసేవాడు. బూతుమాటలతో

శతకాన్ని రాయగలదిట్ట. బసవయ్య నోరు తెరవనీయకుండా చకచకా పన్లు చేయటానికి అలవాటు పడ్డారందరూ!

పెళ్లినాటికి పార్టీ టిక్కెటుక్కి సాధించి ఎన్నికల్లో పోటీ చేసి ఎం.ఎల్.ఏ కాగలిగాడు. రెండు తడవలు డిప్యూటీ మంత్రి చేసిన బసవయ్య మూడోసారి కేబినెట్ మినిస్టర్ కాగలిగేడు.

హస్తినలో అధిష్ఠానం దగ్గర కూడా బసవయ్యకు పలుకుబడి బెత్తెడు మందానవుంది! ఇతగాడి నోటికి దడిచే చెప్పినట్టల్లా తలాడించేది. సి.ఎం. వల్ల కాని పన్లు సైతం క్షణాల్లో బసవయ్య ఢిల్లీ వెళ్లి చేసుకురావటం చూచి ప్రజాప్రతినిధులు... మినిస్టర్లు... బిత్తరపోయేవారు.

బసవయ్య నిజాయితీపరుడు! ఎవరినుంచీ పైసా ఆశించడు. అందుకే అనతికాలంలో ప్రజల మనిషి కాగలిగాడు.

ఎప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి కావలనేది బసవయ్య కల!.

ఇద్దరాడపిల్లల చదువులు పూర్తి అయ్యేనాటికి రాజకీయాల్లో సునామీలా ఎదిగేడు. తనకున్న పలుకుబడితో పెద్దకూతురును ఐ.ఎ.ఎస్... ఉండవ పిల్లను ఐ.పి.ఎస్ చేయగలిగాడు బసవయ్య. వాళ్లకు పెళ్లిళ్లూ చేసేసి బాధ్యత తీర్చేసుకున్నాడు.

కక్కసు దొడ్డిలాంటి బసవయ్య నోటి దుర్గంధం దేశమంతా డెంగ్యూ వ్యాధిలా పాకేసింది. యావత్ భారతంలో బసవయయను ఎరుగని వారు... భయపడనివాళ్లు లేరనేది అతిశయోక్తికాదు.

తాను అసెంబ్లీలో అడుగుపెట్టిన నాటినుండి... సచివాలయంలో వున్న.. ఎయిర్‌కండిషన్డ్ గదిలో కూర్చున్నా.. తనభాష వక్కటే!. అది ఈ జన్మకు మారదు. మాతృభాషకదా... తెలుగు పట్ల తనకు గల అభిలాష... అభిమానం అంతటిది!

తాను డెప్యూటి మినిస్టరైన క్షణంలోనే తన నోటికెంత పవరుందో సచివాలయంలోని అధికారగణానికి... అసెంబ్లీఓ తోటి వారికి అవగతమై... అందరికీ కరతలామలకమైంది.

ఎంతైనా ప్రజాప్రతినిధి... మంత్రి కూడా కదాని ఎందరెందరిని ఎన్నెన్ని రకాలుగ నోరుపారేసుకుంటూ బూతులు తిడుతున్నా సహనంతో సహించటానికి అలవాటు పడ్డారు.

మంత్రి బసవయ్య వాడే భాష భరించలేని అధికారగణమంతా ఛీఫ్ సెక్రటరీని కల్సి తమ బాధ... గోడు... విన్పించారు. నమను బూతుల శరాఘాతాల నుండి కాపాడమంటూ మొరపెట్టుకున్నా... ముఖ్యకార్యర్శి ఆయన అశక్తత వ్యక్తం చేయటంతో ఆఫీసర్స్ అసోసియేషన్ ద్వారా ఈ విషయాన్ని 'డీల్' చేయటానికే నిర్ణయించుకున్నారు ఐ.ఎ.ఎస్. లంతా ఏకమై!

సీనియర్‌మోస్ట్ ఐ.ఎ.ఎస్. అధికారి అసోసియేషన్ కార్యదర్శి కూడా కావటం మూలాన బూతులు తిట్టే మంత్రి బసవయ్యను ఆయన ఛేంబర్లో పర్సనల్‌గ కలిశారు.

తన బాధ అందరి బాధగా వివరించాడు గోకుడు గోపాలరావ్ ఐ.ఎ.ఎస్.

'వారి నీయమ్మ...నాతిట్లు మిమ్మల్ని బాధిస్తున్నాయా? ఆశ్చర్యంగావుందే?.. రాచేత అందరూ కావాలని తిట్టించుకునేవారయ్యా చిన్నతనంలో! డబ్బులిచ్చి మరీ తిట్టించుకునేవాళ్లు! నేను బండ బూతలు తిట్టటం వారి అదృష్టంగ భావించేవాల్లు. నీకు తెలియదేమో?- నా తిట్లకే మీరంతా ఇదైతే ఎట్లానయ్యా... భారత రామాయణ భాగవత గ్రంధాల్లాగ... మనకు ఒక బూతుల పురాణం ఒకటుందని నీకు తెల్సా!- అందాకా ఎందుకు... తిరపతిలో ఏటా జరిగే గంగమ్మ జాతరనాడు మగ ఆడపిల్ల పెద్ద అందరూ అచ్చ తెలుగులో బండబూతలు పబ్లిక్‌ను తిడతారు. అలా తిట్టటం గంగమ్మతల్లికెంతో ఇష్టంట!- అందాకా దేనికి వేములవాడ భీమకవిగారు తిట్టు కవిత్వం చెప్పి పద్యాలు రాశాడు. నువ్వెప్పుడైనా చదివేవా?-

బూతు మానవ జీవితంలో ఒక ముఖ్యమైనా భాగమయ్యా ఐ.ఎ.ఎస్సూ ! చీకట్లో జరిగేవన్నీ బూతు చేష్టలే... కాందంటావా? బూతు అనేది చదవటానికి మాట్లాడుకోవటానికి శానారుచిగా వుంటుంది!. బూతు సినిమాలు... సాహిత్యం మనకు ఎక్కడపడితే అక్కడే దొరుకుతుంది. ఇదైనా తెలుసా? తెలుగు సినీమాల్లో డైలాగులన్నీ డబుల్ మీనింగులే! కాదనగలవా? వాళ్లు చూపిస్తావుంటే గుడ్లు పెద్దవిచేసి చూస్తూ సంబరపడతాం! ఆనందిస్తాం! అవన్నీ రైటైతే నేను ట్టే బండ బూతులూ రైటే! వప్పుకుంటావా!!. సెక్స్‌నున పాఠ్యాంశంగ పెడుతున్నానయ్యా మనం!

అవునయ్యా... నేనింతే! నేను తిడతాను. తెలుగులోనే తిడతాను. ఇంగ్లీషు తిట్లు నాకు రావు. చదువుకున్న మీలాంటి కాళ్లకొచ్చు! ఇడియట్... ఫూల్... రాస్కెల్...ల్లాంటివి ఇంగ్లీషులో అందమైన తిట్లు కావా?

మీరంతా వళ్లు వంచి పన్చెయ్యటం పోయి... నేనున బూతులు తిడుతున్నందుకు నొచ్చుకుంటున్నారా? బాదపడిపోతున్నారా?.

మీ అధికార్లందరికీ కార్లిచ్చాం!... బంగళాలిచ్చాం! టెలిఫోన్లు... సెల్‌ఫోన్లు... నౌకర్లను... పెద్ద జీతాలు ఇస్తున్నాం. కానీ... మేం ఇంత చేస్తున్నా మీకు కష్టపడి పనిచేయటానికి వళ్లొంగదు! అసలు మీరంతా నీకేదేందయ్యా... ఎసి గదుల్లో కుర్చీలకు అతుక్కుపోయి కాగితాలు ఖరాబు చేస్తున్నారు.. అంతేకదూ!

మీరెప్పుడైనా మీ కుర్చీలు విడిచిపెట్టి గ్రామాలకెళ్లారా? ఊళ్లు తిరిగి ప్రజలకేం కావాలో అడిగి తెల్సుకున్నారా? ఏం! అది మీ బాధ్యత కాదా?- మేమే పాదయాత్రలు చెయ్యాలా?...

ప్రభుత్వ పధకాలు పేదలకు ఎంతవరకు చేరుతున్నాయో... వాళ్ల దగ్గరకెళ్లి ఎప్పుడైనా తెల్సుకున్నారా?. మీకివేం పట్టవ్?- ఆఫీసర్లకివేం అక్కర్లేదు.

మీకు జీతాలు... హెూదా... పవరు వుంటే చాలు! కేవలం కాగితాలతో కుస్తీపట్టటానికేనా మీరు వేలకు వేలు జీతాలు... సదుపాయాలు... గౌరవం కోరుకునేది?

నేనంటున్నానని కాదుగానీ... ఇదేనంటయ్యా మన ప్రజలకు మీరు ఒరగబెట్టేది. అదేమంటే... నాయకులమీద దుమ్మెత్తిపోస్తారు. మేం చెప్పినట్టు చేశామంటారు! - మాతోపాటు తినటానికి మాత్రం రెడీ.. కానీ తప్పు జరిగితే గడ్డి కాల్చి మామీద వేయటానికి వెనకాడరు!.

మిమ్మల్ని ఎవ్వరేం అనకూడదు. అడక్కూడదు. మీరు చెప్పిన దానికల్లా మేం తలాడించాలి! అంతేకదా మా నుండి మీరు కోరుకునేది?.

మీ పిల్లలు... ఇంట్లో పెళ్లాం పొరపాట్లుచేస్తే మందలించరా?- అలాగే మేం మిమ్మల్ని మందలించకూడదా? అదేమంటే కులంపేరుతో తిట్టామని కారు కూతలు కూస్తారు, కోర్టుకెడతారు!

నా ఇంటిపేరు 'బి' అంటే ఏమిటో నీకు తెలుసా?- 'బి' అంటే 'బూతుల' అన్నమాట!- నా పూర్తిపేరు బూతుల బసవరాజు.

బూతులు మాట్లాడటం మాకుటుంబానికున్న సంప్రదాయం!- నా తిట్లు ఆశీర్వచనాలు! కొందరు కొట్టి మరికొందరు తిట్టి పన్లు చేయించుకుటారు - నేను రెండవ తరగతికి చెందిన వాడిని!

నా నోరు తేనె తుట్టె! నా బూతు మాటల్లోని మకరందం మధురంగ వుంటుంది.

తిట్టినందుకు సిగ్గుపడక... మీరూ ప్రజలకోసం వాళ్ల అవసరాలకోసం కష్టపడి పనిచేయండయ్యా. ప్రజలవద్దకు పాలన తీసుకెళ్లండయ్యా! అప్పుడు ఈ జనాలే మిమ్ముల్నందరినీ నెత్తినపెట్టుకుంటారు.

ఎల్లెల్లు! ఇంకెప్పుడూ నేను బూతులు తిడుతున్నందుకు ఎవ్వరూ నావద్దకు రాకండి!. నావళ్ల మందుద్ది! ఈ 'బి.బి' అంటే ఏమిటో బోధపడిందిగా!... వెళ్లి నీ కింది వాళ్లందరికీ చెప్పి వాళ్లచేత సకాలంలో పన్లు చేయించండి!

మీరంతా కష్టపడి... మిమ్మల్ని.. అదే... రాజకీయనేతలను... మంత్రులను సుఖపెట్టండి!. మా తలనొప్పి తగ్గించంఇ... కాదు కాదు తలనొప్పి మాకు లేకుండా చేయండి!

ఇప్పుడు మేం  ఒక్కళ్లమే కష్టపడుతున్నాం... ఇకపై.. మాతోపాటు మీరూ జనంలోకెళ్లి వాళ్లకు ప్రయోజనం చేకూరేలా నడుచుకోండి!

బూతుల బసవయ్య పీకిన క్లాస్‌కి ఐ.ఎ.ఎస్. ముఖం తిరిగిపోవటంతో... తలదించుకుని... తప్పుచేసిన వాడికిమల్లే... పిల్లిలా వెనుదిరిగేడు.

కొసమెరుపు : తర్వాత జనరల్ ఎలక్షన్లో గెలిచి 'బి.బి' సి.ఎం. అయ్యాడు! అప్పుడు కిమ్మనలేక బి.బీ. బాధ తప్పనందుకు అందరి ముఖాలు అట్లపెనంలా నల్లగ మాఱిపోయినయ్. దటీజ్ 'బీ! - బీ!.

--- సమాప్తం ---